క్లుప్తంగా

ఇసుక, మొరం తక్కువ ధరకు అందించాలి



నందిపేట్(ఆర్మూర్): ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇసుక, మొరాన్ని తక్కువ ధరకు అందించేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ సతీశ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం సరిపోక లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం భారమవుతుందన్నారు. కె.గంగాదర్, దేవన్న, ఉమ్మెడ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

బంగారు పతకం సాధించిన విద్యార్థికి అభినందన



రుద్రూర్: మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థి ఎం.రుషికేశ్ ఎన్‌సీసీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన షూటింగ్ పోటీలో బంగారు పతకం సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ చెన్నప్ప తెలిపారు. జానకంపేటలో ఇటీవల నిర్వహించిన ఎన్‌సీసీ కార్యక్రమంలో రుద్రూర్ మోడల్ స్కూల్ నుంచి హాజరైన రుషికేశ్ ఉత్తమ ప్రదర్శన కనబర్చి బంగారు పతకం సాధించాడు. దీంతో రుషికేశ్ ను సోమవారం కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

రుద్రూర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



రుద్రూర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని సోమవారం బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజక వర్గంలో పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త శ్రమించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచూపుతుందని ధీమా వ్యక్తం చేశారు. మండల బీఆర్ఎస్ ఇన్‌చార్జి గాండ్ల మధు, నియోజకవర్గ నాయకులుమోచి గణేష్, శివ సూరి, కృష్ణ, మండల సీనియర్ డాక్టర్ సాయిలు, ఆర్. పోచయ్య, నీరడి సాయిలు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు మైక్‌సెట్ వితరణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పిప్రి రోడ్డులోగల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సోమవారం ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ రూ. 16వేల విలువగల మైక్ సెట్, స్పీకర్ సౌండ్ సిస్టమ్ వితరణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్నారు.ప్రిన్సిపల్ విజయానంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుంజిళ్లు తీయడం శిక్ష కాదు



మోర్తాడ్: గుంజిళ్లు తీయడం శిక్ష కాదని అదొక సూపర్ బ్రెయిన్ యోగా అని రిటైర్డు అధ్యాపకులు అందె జీవన్‌రావు అన్నారు. సూపర్ బ్రెయిన్ యోగా అనే అంశంపై సోమవారం భీమ్‌గల్ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులకు గుంజిళ్లు తీయడంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. గుంజిళ్లు తీయడం వల్ల విద్యార్థులలో ఒత్తిడి తగ్గి జ్ఞాపక శక్తి పెరుగుతుందని చెప్పారు. ప్రతి విద్యార్థి రోజుకు తమకు వీలైనన్ని గుంజిళ్లు తీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో స్వామి, ఉపాధ్యాయులు గట్టు ఈశ్వర్, రాజు, వాసు దేవ్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డులుగా చెరువులు

- జంతువుల కళేబరాలు, ప్లాస్టిక్ సామగ్రి పారబోత
- చనిపోతున్న చేపలు
- నందిపేటలోని చెరువుల్లో కలుషితమవుతున్న నీళ్లు



పారబోసిన ప్లాస్టిక్ వ్యర్థాలు



నందిపేట తాళ్ల చెరువు నీటి వద్ద చెత్త చెదారం

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రానికి సమీపంలోని బైపాస్ రోడ్డు గుండా ఉన్న తాళ్ల చెరువు, ఊర చెరువులు చెత్తతో డంపింగ్‌యార్డులుగా మారాయి. గ్రామాలలోని ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్, హోటళ్లు, చికెన్ సెంటర్ల నిర్వహకులు తమ వ్యాపారానికి సంబంధించిన వ్యర్థ పదార్థాలను, అలాగే కుక్కలు, పందుల కళేబరాలను చెరువులలో పారవేస్తున్నారు. కల్యాణ మండపాలలో జరిగే శుభకార్యాలకు సంబంధించిన ఆహార వ్యర్థాలను, ప్లాస్టిక్ సామగ్రిని చెరువుల్లో పారబోస్తున్నారు. దీంతో చెరువుల వద్దకు వెళ్లగానే దుర్గంధం వస్తుంది.నీరు కలుషితం కావడంతో చెరువుల్లో పెరిగే చేపలు మృత్యువాత పడుతున్నాయి. వ్యవసాయ అవసరాలకు ఉపయోగించే నీరు కలుషితమవుతోంది. దీంతో ప్రజారోగ్యానికి ముంపు పొంచి ఉంది. అలాగే పర్యవరాణానికి హాని కలుగనుంది. చెరువులలో చెత్తను వేసే వారిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నందిపేట ఊర చెరువులో చెత్తచెదారం

కంపుకొడుతోంది

చెరువులలో చెత్త వేయడంతో ఆవరణ అంతా కంపు కొడుతోంది. రోడ్డు గుండా పోవాలంటే భయం వేస్తుంది. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. చెరువులలో చెత్త పారబోసే వారిపై చర్యలు తీసుకోవాలి – శేఖర్‌రెడ్డి, నందిపేట

చేపలు చనిపోతున్నాయి

చెరువులో చెత్తతో పాటు జంతువుల కళేబరాలు వేయడంతో నీరంతా కలుషితం అవుతుంది. చెరువులో పెరిగే చేపలు చనిపోతున్నాయి. దీంతో తాము జీవనోపాధి కోల్పోతున్నాము. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. – గూండ్ల రాజు, నందిపేట

చర్యలు తీసుకుంటాం

చెరవులలో చెత్తను వేయకుండా చర్యలు తీసుకుంటాం. వ్యాపార వర్గాల వారు జీపీకి చెందిన ట్రాక్టర్లలో చెత్తను వేయాలి. చెరువులలో చెత్తను వేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసరావు, ఎంపీడీవో, నందిపేట

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



బోధన్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



ఆర్మూర్ అంబేడ్కర్ చౌరస్తాలో..



నందిపేటలో..



కోటగిరిలో..

ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం దండోర, ఎమ్మార్పీఎస్ నాయకులు పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, దండోరా నాయకులు పాల్గొన్నారు

– బోధన్‌టౌన్/ఆర్మూర్‌టౌన్/నందిపేట్/రుద్రూర్/మోర్తాడ్/వేల్పూర్



తిమ్మాపూర్‌లో..

బీఎల్‌వోల మీటింగ్ వాయిదా వేయాలి



రుద్రూర్: బీఎల్‌వోలకు ట్రైనింగ్ మీటింగ్‌ను ఈనెల9న కాకుండా మరుసటి రోజు నిర్వహించాలని బూత్ లెవెల్ ఆఫీసర్లు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఉపతహసీల్దార్ సురేందర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ ఆఫీసర్లు మాట్లాడుతూ జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ఉన్నందున సమ్మెలో పాల్గొంటున్నట్లు నెల రోజుల క్రితం సంబంధిత అధికారికి సమ్మె నోటీసు అందజేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్, బీఎల్‌వోలు పద్మ, ప్రతిమ, గంగామణి, రూప, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



బాల్కొండ: ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడు రాంగిరి బాలగంగాధర్‌ను సోమవారం పాఠశాలలో ముప్కాల్ పరిరక్షణ సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. తన ఇద్దరి కూతుళ్లను తాను బోధిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి అందరికి ఆదర్శంగా నిలిచాడన్నా రు. హెచ్‌ఎం గంగారాం, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమ్మె వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



బాల్కొండ/బోధన్‌టౌన్/ ఆర్మూర్‌టౌన్ : బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో లంగర్ బీడీ కంపెనీ వద్ద సోమవారం ఈ నెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను బీడీ కార్మికులతో కలిసి టీయూసీఐ నాయకులు ఆవిష్కరించారు.అలాగే బోధన్ పట్టణంలో ఇఫ్టు ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా టీయూసీఐ రాష్ట్ర నాయకులు మత్తెన్న, బి.మల్లేశ్‌లు మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాల్లో 15 చట్టాలను కేంద్రం ప్రభుత్వం తొలగించిందన్నారు.

యువతపైనే దేశ భవిష్యత్



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్‌ఐ అనిల్‌రెడ్డి

కమ్మర్‌పల్లి/బోధన్‌టౌన్ : దేశ భవిష్యత్ యువతపైనే ఉందని కమ్మర్‌పల్లి ఎస్‌ఐ అనిల్‌రెడ్డి అన్నారు. సోమవారం కమ్మర్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'మత్తు పదార్థాల నియంత్రణ' అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మత్తుకు బానిసకావొద్దని సూచించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు మధు, రాజ్‌కుమార్, వెంకటేష్, గంగారాం, మహేందర్, స్వాతి తదితరులు పాల్గొన్నారు. మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దని బోధన్ పట్టణ ఎస్సై వెంకట నారాయణ అన్నారు. పట్టణంలోని విద్యావికాస్ జూనియర్ కాలేజీలో మత్తు పదార్థాల నియంత్రణ అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు.

సైబర్ నేరాలపై అవగాహన

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం షీ టీం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు విఘ్నేష్, సుమతి మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలను ఉదాహరణలతో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు , తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో సీటు పొందిన విద్యార్థులకు సన్మానం



మోర్తాడ్/వేల్పూర్ : వేల్పూర్ మండలం కుకునూర్ ఉన్నత పాఠశాల నుంచి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులు పి.సహస్ర, ఏ.స్వాతిక, హెచ్‌ఎం హరిచరణ్ లను రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సోమవారం సన్మానించారు. మోర్తాడ్ మండలం సుంకెట్‌లో బండి అనూశ్రీ, అంకం శ్రీహిత, వేముల నిహారికలు ట్రిపుల్ ఐటీలో సాధించడంతో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, హెచ్‌ఎం సంతోష్, ఉపాధ్యాయులు వీరిని సన్మానించారు.



నేటి చిత్రం



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

రెంజల్: రెంజల్ మండలకేంద్రంలో రూ. 25 లక్షలతో నిర్మించిన మైనారిటీ గురుకుల పాఠశాల నుంచి మురుగు నీరును రోడ్డుపైకి వదులుతున్నారు. పాఠశాల వెనుక భాగంలో దుర్గంధం వ్యాపిస్తోంది. పైప్‌లైన్ వ్యవస్థ లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. – మర్లపాటి దత్తు, రెంజల్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

ఆర్మూర్‌లో కానరాని స్వచ్ఛత

- మున్సిపల్ పరిధిలోని వీధుల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు
- డ్రైయినేజీల్లో నిండిన చెత్తాచెదారం
- వీధుల్లో చల్లని బ్లీచింగ్ పౌడర్



కూరగాయల మార్కెట్ సమీపంలో డ్రైయినేజీలో పేరుకుపోయిన చెత్తచెదారం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 36వార్డులలోని పలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయి పరిసరాలుగా అపరిశుభ్రంగా మారాయి. దోమలవ్యాప్తి పెరగడంతో ప్రజలు సీజనల్ వ్యాధులబారిన పడుతున్నారు. జర్నలిస్టు కాలనీ, శాస్త్రీనగర్, విద్యానగర్ పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు కొట్టారు. వాటిని తరలించడంలో నిర్లక్ష్యం వహించడంతో వర్షాలకు చెత్త కుళ్లీ దుర్వాసన వస్తుందని కాలనీవాసులు అంటున్నారు. పారిశుద్ధ్య వ్యర్థాల సేకరణ నిరంతరంగా జరగడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మామిడిపల్లి శివారులో, జిరాయత్ నగర్, పెర్కిట్ జాతీయ రహదారి పక్కన టీస్టాల్స్, వీధి వ్యాపారులు, చిక్కన్, మటన్ వ్యాపారులు దుకాణాల వ్యర్థాలను రోడ్ల పక్కన వేయడంతో దుర్వాసన వస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు కాలనీలో ఫాగింగ్ సైతం చేయించడం లేదని ప్రజలువాపోతున్నారు. పట్టణంలో ఇన్‌చార్జి శానిటరీ ఎస్సైగా హెల్త్ అసిస్టెంట్ సురేష్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వర్షకాలంలో దోమలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాం

వందరోజుల ప్రణాళికలో 140కిలోమీటర్ల మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాం. శానిటేషన్ ప్రత్యేక దృష్టి సారించాం. రోడ్డు పక్కన చెత్తను వేస్తున్న వారికి నోటీసులు ఇస్తాం. ప్రజలకు చెత్త నిర్వహణపై అవగాహన కల్పిస్తాం. సమస్యను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాం.

–రాజు, మున్సిపల్ కమిషనర్,ఆర్మూర్





హుస్నాబాద్ కాలనీలోని డ్రైయినేజీలో నిలిచిన నీరు, విద్యానగర్‌లో రోడ్డుపక్కన పడేసిన చెట్టుకొమ్మలు

విద్యార్థుల సమస్యలను విస్మరిస్తున్న ప్రభుత్వం



ఆర్మూర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్: గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను విస్మరిస్తుందని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం(ఏఐపీఎస్‌యూ) జిల్లా కార్యదర్శి బోడఅనిల్ అన్నారు. ఏఐపీఎస్‌యూ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్‌చౌరస్తా వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ. 7500 కోట్లకు పైగా స్కాలర్‌షిప్ ఫీజు, రీయంబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. లేనిచో కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఎంపీల, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐపీఎస్‌యూ నాయకులు గోపాల్ సింగ్, శివ, గణేశ్, సూర్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాత్మికం

శివాలయంలో గాజుల పూజ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం అన్నపూర్ణమాతకు, శివలింగానికి రంగురంగుల గాజులతో అలంకరించి పూజలు చేశారు. అలాగే రామాల యం ఆవరణలో 500 మంది మహిళలచే అన్నపూర్ణమాతకు ఆలయ అర్చకుడు కుమార్ శర్మ మంత్రోచ్ఛరణల మధ్య గాజులతో పూజలు నిర్వహించి సామూహిక కుంకుమార్చన చేశారు. పూజానంతరం మహిళ భక్తులకు గాజులను అందజేశారు. అనంతరం నందీశ్వర మహారాజ్ సమక్షంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో బి.సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, రవి, కొంత మురళీ, రామాగౌడ్, బోండ్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి విరాళం



బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామంలో నిర్మిస్తున్న శివాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ఆరేపల్లి భోజన్న సోమవారం రూ. 15 వేలు విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులకు ఆయనను అభినందించారు. దాతలు ముందుకు రావాలని ఈసందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద స్ఫూర్తిని అలవర్చుకోవాలి



కోటగిరిలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

రుద్రూర్: వివేకానంద స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని శ్రీరామకృష్ణ సేవా సమితి ధ్యాన మందిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. వివేకానంద విగ్రహానికి పూలమాలలు అర్పించారు. అనంతరం వివేకానంద స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గాంధీజీ ,వివేకానంద సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాలన్నారు కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సభ్యులు గోగినేని శివ శ్రీనివాస్, హన్మంత్‌రావు, రజిని, నాగశ్రీ, రవిచంద్ర, నితిన్‌చంద్ర పాల్గొన్నారు.

ఫారెస్ట్ భూములపై సబ్‌కలెక్టర్ విచారణ



వర్ని: మోస్రా మండలంలోని ఫారెస్ట్ భూములను సోమవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్‌మహతో పరిశీలించారు. సర్వేనంబర్ 952 లో ఎంత ఫారెస్ట్ భూమి అటవీ ప్రాంతానికి వెళ్లి ఆయన విచారణ జరిపారు.

సంక్షిప్తం

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల అందజేత

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని మాలివాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం ముమ్మలనేని రాజశేఖర్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను అందజేశారు. ఈసందర్భంగా ఎంఈవో నాదెండ్ల శ్రీనివాసరావు మాట్లాడారు.

వైద్య శిబిరం

కమ్మర్‌పల్లి/నందిపేట : కమ్మర్‌పల్లి మండలం హసాకొత్తూర్ గ్రామంలో సోమవారం చౌట్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో వైద్యాధికారి స్పందన 54 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నందిపేట పాలిటెక్నిక్ కళాశాలలో నందిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి ప్రవీణ్ రెడ్డి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు.

ఇళ్ల నిర్మాణానికి సహకరించాలి

వర్ని: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ కమిటీ సభ్యులు లబ్ధిదారులకు సహకరించాలని వర్ని ఎంపీడీవో వెంకటేశ్వర్ సూచించారు. సోమవారం మండలంలోని మల్లారం గ్రామంలో లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇళ్లను ఎంపీడీవో పరిశీలించారు.

కాంప్లెక్స్ హెచ్‌ఎంల సమావేశం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ స్థాయి హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత యూనిఫాంలను సకాలంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు



వర్ని: వన మహోత్సవంలో భాగంగా మండలంలోని జాకోరాలో అధికారులు మొక్కలు నాటారు. ఎంపీడీవో వెంకటేశ్వర్, ఎంపీవో మారుతి, ఈజీఎస్ ఈసీ అరుణ్, టీఏలు సురేష్, వినోద్ న్నారు.